జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..


జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 27-9-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 467 పేజీలు: 4 వెల : రూ.7

# అర్ధరాత్రి చోరీ



* పాతపట్నం మండలంలో రెండు చోట్ల పుస్తెల తాళ్లు దొంగతనం
* దసరా సెలవులకు ఇతర ప్రాంతాలకు వెళుతున్న కుటుంబాలు
* ఇదే అదనుగా రెచ్చిపోతున్న దొంగలు
* హడలిపోతున్న జిల్లావాసులు

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబర్ 26 (వార్త): కొందరు వ్యక్తులు వ్యసనాలకు లోనై చివరకు దొంగతనాలకు పాల్పడుతున్నారు. మద్యం, గంజాయి తాగి మత్తులో ఏం చేస్తున్నామన్నది గమనించడం లేదు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న ఆశతో ఏకంగా దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతూ చివరికి కటకటాలపాలవుతున్నారు. గురువారం అర్ధరాత్రి పాతపట్నం మండలంలోని పాసిగంగుపేట, చంద్రయ్యపేట గ్రామాల్లో సుమారు 12.30 గంటల సమయంలో దొంగలు.. నిద్రిస్తున్న ఇద్దరు మహిళల మెడలోని పుస్తెల తాడును దొంగిలించుకుపోయారు. పాసిగంగుపేట గ్రామానికి చెందిన గంగు లక్ష్మి మెడలో నుంచి రెండు తులాల బంగారు పుస్తెలతాడును, చంద్రయ్యపేట గ్రామంలో మొర్రి పద్మావతి మెడలో నుంచి రెండుతులాల పుస్తెలతాడును అగంతకులు దొంగిలించుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పాతపట్నం ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దసరా సెలవుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇస్తే.. ఆయా ప్రాంతాల్లో గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు.





# బంగారం షాపులపై..

# జీఎస్టీ అధికారుల సోదా

* ఉదయం పది నుంచి రాత్రి వరకూ తనిఖీలు * జీరో ట్యాక్స్ లావాదేవీలపై ఆరా * షాపులు, ఇళ్లలోనూ తనిఖీ * బంగారం వ్యాపారుల్లో గుబులు
* జిల్లాలో పలుచోట్ల మూతపడిన షాపులు

**నరసన్నపేట/జలుమూరు, సెప్టెంబరు 26 (వార్త):** బంగారు వ్యాపారానికి కేరాఫ్‌గా మారిన నరసన్నపేటలోని బంగారం దుకాణాలపై జీఎస్టీ కస్టమ్స్ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. విశాఖపట్నం కేంద్ర జీఎస్టీ అండ్ కస్టమ్స్ శాఖ డిప్యూటీ కమిషనర్ వర్మ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు బంగారం షాపులు, హోల్‌సేల్ వ్యాపారుల ఇళ్లలోనూ తనిఖీలు చేపట్టారు. తమ్మయ్యపేటలోని ఉప్పు గిరి ఇంట్లో, ఆదివారం పేట జంక్షన్‌లోని శ్రీగౌరీ శంకర్ జ్యూయలర్స్ షాపులతో పాటు మరికొన్ని దుకాణాలపై శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు చేసి పలు రికార్డులను పరిశీలించారు. మరికొన్నింటిని స్వాధీనం చేసుకున్నారు. వీరంతా భారీ మొత్తంలో జీరో ట్యాక్స్‌లో లావాదేవీలు నిర్వహించినట్లు అధికారుల దాడుల్లో వెలుగుచూసింది. దసరా సమయంలో జీఎస్టీ అధికారుల దాడులతో బంగారం వ్యాపారుల్లో ఒక్కసారిగా గుబులు రేపింది. నరసన్నపేటలో జీఎస్టీ అధికారులు తనిఖీలు చేస్తున్నారన్న వార్త దావానంలా వ్యాపించడంతో జిల్లావ్యాప్తంగా పలు దుకాణాలు మూతపడ్డాయి. కొద్ది నెలల కిందటే బీఐఎస్ అధికారులు నరసన్నపేటలోని పలు బంగారు షాపులపై దాడులు చేయగా, ఈసారి కేంద్ర జీఎస్టీ అధికారులు తనిఖీలకు రావడం చర్చనీయాంశమైంది.



## ముందస్తు ప్రణాళిక, భద్రతతో..

# కొత్తమ్మ తల్లి ఉత్సవాలు విజయవంతం

* జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి





**కోటబొమ్మాళి, సెప్టెంబరు26(వార్త):** కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాలు అశేష భక్తజన సందోహం నడుమ అత్యంత వైభవంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతియుత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ ముందస్తు ప్రణాళికతో సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదన్నారు. మూడు రోజులు పాటు జరిగిన ఉత్సవాల సందర్భంగా పోలీసు అధికారులు ప్రత్యేక నిఘా వ్యవస్థ, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలను నియమించి, సీసీ కెమెరాలు, డ్రోన్లు ద్వారా నిరంతరం కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షించామన్నారు. డ్రోన్లు ద్వారా రద్దీ ప్రదేశాలపై ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు. రహదారి మార్గాలు, ప్రధాన వీధులు, శోభాయాత్ర మార్గాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పార్కింగ్ ప్రదేశాలు, హెలికాప్టర్ రైడ్, ఆలయ పరిసరాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది తోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం, సమన్వయం చేసి భద్రతను మరింత బలోపేతం చేశామన్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా అదనపు పోలీసు సిబ్బందిని నియమించి, ట్రాఫిక్ సాఫీగా సాగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. పిల్లలు, మహిళలు తప్పిపోకుండా ప్రత్యేక పోలీసు ఔట్ పోస్టును ఏర్పాటు చేశామని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో వైద్య సహాయం కోసం అంబులెన్స్‌లు, వైద్య సిబ్బంది, భద్రత దృష్ట్యా ఫైర్ ఇంజన్లను ఉంచడంతో పాటు అవి సకాలంలో వెళ్లేలా చూశామన్నారు. ఉత్సవ ప్రాంతాల్లో నిరంతర గస్తీ ప్రత్యేక నిఘా వ్యవస్థ ద్వారా పర్యవేక్షణ కొనసాగించామని చెప్పారు. కొత్తమ్మ తల్లి ఉత్సవాలు శాంతియుతంగా జరిగేందుకు అన్ని శాఖల సహకారం తీసుకున్నామని ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు.

## ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకూ పోస్టాఫీసుల్లో

# ఆధార్ సేవలు

* 12న దీన్ దయాల్ స్పర్శ యోజన ఫిలాటలీ స్కాలర్‌షిప్ పరీక్ష * హెడ్ పోస్ట్ ఆఫీస్ సూపరింటెండెంట్ హరిబాబు

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 26 (వార్త):** ప్రజలకు ఆధార్ సేవలను మరింత సులభతరం చేసే దిశగా శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై శ్రీకాకుళం పోస్టల్ డివిజన్‌లోని హెడ్ పోస్టాఫీసులలో ఆధార్ సేవా కౌంటర్లు ప్రతి పని రోజున ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటాయని హెడ్ పోస్ట్ ఆఫీస్ సూపరింటెండెంట్ వి. హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం హెడ్ పోస్టాఫీస్, టెక్కలి హెడ్ పోస్టాఫీస్, అమదాలవలస హెడ్ పోస్టాఫీస్‌లలో ఈ సేవలు లభ్యం కానున్నాయి. ఈ కేంద్రాలలో కొత్త ఆధార్ నమోదు, పేరు/చిరునామా/పుట్టిన తేదీ/మొబైల్ నంబర్/ఇమెయిల్ ఐడీ నవీకరణ, బయోమెట్రిక్ అప్‌డేట్‌తో పాటు పిల్లల తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ వంటి అన్ని రకాల ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయి. సేవలను పొందేవారు తప్పనిసరిగా గుర్తింపు, చిరునామా, పుట్టిన తేదీకి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సమర్పించవలసి ఉంటుందని సూపరింటెండెంట్ హరిబాబు పేర్కొన్నారు. మరోవైపు, పోస్టల్ శాఖకు సంబంధించిన "దీన్ దయాల్ స్పర్శ యోజన" ఫిలాటలీ స్కాలర్‌షిప్ మొదటి స్థాయి పరీక్ష తేదీలో మార్పు చోటు చేసుకుంది. పాఠశాలలకు దసరా సెలవులు రావడంతో ఈ పరీక్షను వాయిదా వేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ పరీక్ష వచ్చేనెల 12వ తేదీన ఉంటుందని, అభ్యర్థులు ఈ మార్పును తప్పక గమనించాలని అధికారులు కోరారు. మరింత సమాచారం కోసం సంబంధిత పోస్టాఫీసులను, యుఐడిఏఐ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## దసరా కానుకగా డీఏను ప్రకటించండి

**-ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ**

**హిరమండలం, సెప్టెంబరు 26 (వార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి16 నెలల కాలంలో నాలుగు డిఏలు పెండింగ్ పెట్టారని దసరా మందు కనీసం ఒక డిఏ అయినా ప్రకటించలేదని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ అన్నారు. ఉద్యోగులకు పండగ ఆనందం లేదని, అను నిత్యం ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లే ఉద్యోగులకు వారికి రావలసిన ప్రయోజనాలను సకాలంలో చెల్లిస్తే ఇంకా ఉత్సాహంతో పని చేస్తారని వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యాల్ని ఇంకా వేగంగా చేరుకోగలమని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దసరా కానుకగా డీఏను ప్రకటించి ఉద్యోగులకు పండగ ఆనందం కలిగించాలని వారు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# 14 కేజీల గంజాయితో ఒకరి అరెస్టు



**పలాస, సెప్టెంబరు 26(వార్త):** అక్రమంగా తరలిస్తున్న 14 కేజీల గంజాయి తో ఒకరిని అదుపులో తీసుకున్నామని పలాస జిఆర్పిఎఫ్ ఎస్ఐ ఏ కోటేశ్వరరావు ప్రకటించారు. శుక్రవారం పలాస గవర్నమెంట్ రైల్వే పోలీస్ పరిధిలో శుక్రవారం పలాస రైల్వే స్టేషన్ ప్లాట్ఫారం నెంబరు టూలో విధుల్లో భాగంగా పోలీసులతో జి ఆర్ పి ఎస్సై ఏ కోటేశ్వరరావు సిబ్బందితో అనుమానితులను తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి అనుమానస్పదంగా కనిపించడంతో ఆయన్ని పట్టుకొని ఊరు పేరు అడగ తన పేరు మోరిస్ తమిళనాడు రాష్ట్రానికి చెందిన వాడిని చెప్పాడు. అతను వద్ద ఒక రెడ్ కలర్ ట్రాలీ బ్యాగ్ ఉంది ఆ బ్యాగ్ లో ఏముందని అడగ్గా గంజాయి అని చెప్పడంతో వెంటనే అతన్ని అదుపు లోకి తీసుకోవడం జరిగిందన్నారు. మధ్యవర్తుల సమక్షంలో ఈ గంజాయి ఎక్కడ నుంచి తీసుకొచ్చావ్ అని, అడగ్గా రాయగడకు చెందిన రాహుల్ అనే వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి గంజాయి 14 కేజీలని తెలిపారు. 71000 అతనికి డబ్బులు ఇవ్వడం జరిగిందని వివరించాడు. రాయగడ్ నుంచి గంజాయి బస్సులో వచ్చి శుక్రవారం పలాసలో ట్రైన్ ఎక్కి మా ఊరికి వెళ్ళిపోదామని వేచి ఉండడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. పోలీసులు అతన్ని అదుపులో తీసుకున్న అరెస్ట్ చేసి ఆ ట్రాలీ బ్యాగ్ అని వద్దన్న ఒక సెల్ ఫోనును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్ పంపించడం జరిగినదని జి ఆర్ పి ఎస్సై తెలిపారు. ఈయనతో పాటు జిఆర్పిహెచ్సి సోమేశ్వరరావు ఉన్నారు.

# ఆలయానికి రూ.40లక్షల గ్రానైట్ బాబా వితరణ



**పలాస, సెప్టెంబరు 26(వార్త):** మాకన్నపల్లిలో నూతనంగా నిర్మితమవుతున్న శివాలయం పనులను పలాస పిఏసిఎస్ మాజీ చైర్మన్ , షిరిడీ సాయి సంస్థాన్ ట్రస్టు చైర్మన్ దువ్వాడ శ్రీధర్ శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ దేవాలయ ప్రాంగణంలో ప్రధానమైన శివాలయం తో పాటు గణపతి, పార్వతీదేవి, సుబ్రహ్మణ్యస్వామి, శనీశ్వరుడు (నవగ్రహ దేవాలయం)ఉప దేవాలయాలను కూడా నిర్మిస్తున్నారు. ధ్వజ స్తంభం, గాలిగోపురం గుడులను సైతం నిర్మిస్తున్నారు. ఇందుకు అవసరమైన ఫ్లోరింగ్ కోసం సుమారు రూ.4లక్షల విలువ చేసే గ్రానైట్ పలకలను దువ్వాడ శ్రీధర్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో జరుగుతున్న గ్రానైట్ ఫ్లోరింగ్ పనులను ఆయన పరిశీలించి కమిటీ సభ్యులకు తగు సూచనలు చేశారు. సుమారు 70 సెంట్లు విస్తీర్ణంలో సుమారు 2 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో శివాలయాన్ని నిర్మిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దేవాలయ నిర్మాణం పూర్తి చేసేందుకు దాతల సహకారం తీసుకుంటున్నా మని కమిటీ సభ్యులు తెలిపారు. ఉద్దాన ప్రాంతంలో ఇటువంటి అద్భుతమైన దేవాలయాన్ని నిర్మించేందుకు కమిటీ సభ్యులు చేస్తున్న కృషిని దువ్వాడ శ్రీధర్ ప్రశంసించారు.

కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సైని దేశయ్య, మాజీ సర్పంచ్ కుత్తుమ ధర్మారావు, కుత్తుమ లోకనాథం, బత్తిన వీరాస్వామి, తెప్పల భీమా రావు, బత్తిన పోలయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి సీదిరి



**పలాస, సెప్టెంబరు 26(వార్త):** మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పలాస మండలం పరిధిలో శుక్రవారం పలు పరామర్శ కార్యక్రమాల్లో పాల్గొన్నరు. పలాస మండలం లొద్దబాద్ర గ్రామానికి చెందిన ప్రకృతి ప్రేమికుడు, సేవాతత్పరుడు చిన్నాచారి ఇటీవల హఠాన్మరణం చెందారనే విషయం తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పలాస మండలం మహాదేవిపురం గ్రామానికి చెందిన వైస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బురిలీ మాధవరావు ఇటీవల అనారోగ్యంతో మరణించారనే విషయం తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పలాస మండలం చినంచల గ్రామానికి చెందిన పొట్నూరు కాంతమ్మ ఇటీవల మరణించారనే విషయం తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో పలాస మండలం మాజీ ఎంపీపీ బత్తిని హెమేశ్వరరావు, వైస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, వైస్సార్సీపీ పలాస-కాశీబుగ్గ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపీ, పలాస పిఏసిఎస్ మాజీ అధ్యక్షుడు చింతాడ మాధవరావు, వైస్సార్సీపీ పలాస ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అంబటి ఆనందరావు, లండ జోగరావు, స్థానిక వైస్సార్సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి కలిసిన మాజీ మంత్రి శివాజీ

**పలాస, సెప్టెంబరు 26(వార్త):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును గౌరవప్రదంగా సచివాలయంలో కలసిన మాజీ మంత్రి శివాజీతో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు అశోక్‌బాబు, గౌతు శిరీష మర్యాదపూర్వకంగా శుక్రవారం సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో పాటు సరదాగా కాసేపు గడిపారు. మాజీ మంత్రి శివాజీని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. పార్టీ రాష్ట్ర శ్రీశయన మెంబర్ బూర్ల కృష్ణంరాజు తదితరులు ఉన్నారు.

## జీఎస్టీ 2.0 పై అవగాహన సదస్సు




**పలాస, సెప్టెంబరు 26(వార్త):** పలాస పిసిఎంఏ సంఘం ఆధ్వర్యంలో జిఎస్టి 2.0పై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో వివిధ వర్తక సంఘాలు సుమారు 200 మంది పాల్గొన జిఎస్టి 2.0 లో ఉన్న టాక్స్ రాయితీల విధివిధానాలు చిన్నా మధ్యతరగతి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం కోటను, ప్రభుత్వం అందిస్తున్న వరాలుగా ముఖ్య అతిథులు విచ్చేసిన మన అధ్యక్షులతోపాటు స్థానిక అసిస్టెంట్ కమిషనర్ నాగరాజు వివరించారు.అధ్యక్షులు మల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన జీఎస్టీ 2.0 అవగాహన సదస్సుకు మన కాశీబుగ్గ సర్కిల్ డి సి టి ఓ కామేశ్వరరావు, కాళీ ప్రసాద్, పిసిఎంఏ జనరల్ సెక్రటరీ రవిశంకర్ గుప్తా, కోశాధికారి, సంతోష్ తో పాటు పారిశ్రామిక వాడ అధ్యక్షులు రామేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ సూపర్ హిట్



**పలాస, సెప్టెంబరు 26(వార్త):** సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు అన్నారు. శుక్రవారం పలాస తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు కూటమి ప్రభుత్వం గత15 నెలలుగా జరుగుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమం పెద్ద ఎత్తున ప్రజలలో ప్రచారం చేయులని, సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సూపర్ సిక్స్ పథకాలపై కార్యచరణ సమీక్షించి, అందరూ సూచనలు అనుసరిస్తూ భవిష్యత్తులో విస్తృత స్థాయి ప్రసారాలు నిర్వహించడానికి ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, టిడిపి నేతలు పీరుకట్ల విఠల్, బడ్డ నాగరాజు, దువ్వాడ శ్రీకాంత్, మల్లీ పెద్ది నరేంద్ర, గాలి కృష్ణారావు, లోడగల కామేష్, గురిటి సూర్యనారాయణ, దువ్వాడ హేమ బాబు చౌదరి, టిడిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఉమా కామేశ్వరికి కుంకుమార్చనలు

**నరసన్నపేట, సెప్టెంబరు 26 (వార్త):** సత్యవరం అగ్రహారంలో ఉన్న శ్రీ ఉమా కామేశ్వరి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. శుక్రవారం శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆలయ అర్చకులు వసనాభి హేమ సుందర్ తెలిపారు. ముత్తైదువులు విరివిగా పాల్గొని పూజలు చేశారు. సాయంత్రం విశేష పూజలు ఉంటాయని తెలిపారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మబగాంలో పారిశుధ్య లోపం

**పోలాకి, సెప్టెంబరు 26 (వార్త):** పోలాకిలోని మబగాంలో పారిశుధ్య పర్యవేక్షణ లోపంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. మబగాం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఈ దుస్థితి నెలకొందన్నారు. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి రోగాల బారి నుంచి కాపాడాని స్థానికులు కోరుతున్నారు. 15 రోజులుగా ఇలానే ఉందన్నారు.





## రణాసురమ్మవారి ఆలయంలో పూజలు

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు26(వార్త):** ఉప్పాడ వీధిలో కొలువు దీరిన గ్రామ దేవత రణాసుర అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా భవానీలు శుక్రవారం 5వ రోజు మహా లక్ష్మి అవతారం పూజ కార్యక్రమం నిర్వహించారు. అలానే దుర్గదేవి గురు స్వామి పాతిర్ల గిరి బాబు రెడ్డి ని, ఆలయ అర్చకులు ఆసి కృష్ణయ్య ని, గణేష్ పంతులు ని, భవానిలూ ఘనంగా సన్మానం చేశారు.

## ప్రత్యేక అవసరాల పిల్లలకు నిర్ధారణ పరీక్షలు



**నరసన్నపేట, సెప్టెంబరు 26(వార్త):** నరసన్నపేటలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అవసరాల పిల్లల పరికరాల నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష అదనపు పథక సంచాలకులు శశిభూషణరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్నటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వైద్యులు రంజన్, అజిత్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. నాలుగు మండలాల ఎంఈఓ లు పాల్గొన్నారు.

## పాస్‌పోర్ట్ పోయింది




**ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 26(వార్త):** కొమ్మువలస గ్రామానికి చెందిన కుంచాల సుభాషిని భర్త చంద్రశేఖర్ పాస్‌పోర్ట్ పోయింది. ఈనెల 10వ తేదీన ఎల్ ఎన్ పేట జంక్షన్ నుంచి తన స్వగృమైన కొమ్మువలస గ్రామానికి వస్తుండగా ఆమె బ్యాగ్ లో ఉన్న పాస్ పోర్ట్ మార్గమధ్యలో పోయిందని ఆమె తెలిపారు. ఈ యొక్క పాస్ పోర్ట్ ఎవరికైనా దొరికినట్లయితే దయచేసి 8978977709 ఈ నెంబర్ కు ఫోన్ చేసి తెలియజేయగలరు.

## ఓజీ సినిమా విజయవంతంపై సంబరాలు

**వీరఘట్టం, సెప్టెంబరు 26(వార్త):** జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నటించిన నూతన చిత్రం ఒరిజినల్ గ్యాంగ్( ఓ జి ) సినిమా విజయవంతమైన సందర్భంగా శుక్రవారం వీరఘట్టంలోని బిఎంఆర్ థియేటర్ వద్ద కూటమి నాయకులు పవన్ కళ్యాణ్ అభిమానులు సంబరాలు జరుపుకున్నారు టిడిపి పట్టణ శాఖ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కేకును కట్ చేసి పవన్ పై ఉన్న అభిమానాన్ని ఈ విధంగా చాటుకున్నారు జామి లక్ష్మి నారాయణ, ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బళ్ళ హరిబాబు, తూముల రమేష్ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి జనసేన జానీ, టౌన్ జనసేన నాయుకులు సరిపల్లి అచ్యుత్, కర్నెన సాయి పవన్, ఉదయాన చరణ్ నందివాడ పండు, టౌన్ కూటమి నాయుకులు జంపు శేఖర్, చుక్కా శ్రీను, సుమన్, వినోద్, బిట్టు, రాజేష్, సందీప్ , మండల, టౌన్ కూటమి నాయుకులు కార్యకర్తలు జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యేకి యూరియా వెతలు పట్టవా?




**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 26(వార్త):** నియోజకవర్గంలో రైతులు యూరియా కోసం పడుతున్న తిప్పలు స్థానిక ఎమ్మెల్యే అశోక్ కి పట్టడం లేదా అని నియోజకవర్గ వైస్సార్సీపీ యూత్ అధ్యక్షుడు నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్ ప్రశ్నించారు. కంచిలి మండలం జలంత్ర కోట పంచాయతీలో యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థలు వీడియో ఫోటోలు తీశారు. ఇలా నాలుగు మండలాలు మున్సిపాలిటీలో రైతులు పడుతున్న అవస్థలు కనపడలేదా మూడవ సారి ఎమ్మెల్యే ని అని గొప్పలకు పోవడం కాదు రైతులపై నిర్లక్ష్యపు ధోరణి అవగాహనా రాహిత్యానికి తార్కాణం కాదా?అని ప్రశ్నించారు. ఖరీఫ్ మొదలై సుమారు మూడు నెలలు గడుస్తున్నా ఎందుకు పూర్తిసాయిలో రైతుల ఎరువులు అందించలేకపోయారు, ఇది మీ ప్రభుత్వం వైఫల్యం కాదా అని అన్నారు. నియోజకవర్గం లో చిన్న సన్నకారు రైతులు పడుతున్న ఇబ్బందులకు తీసుకున్న చర్యలు ఏమిటి? ఇక్కడ కూడా రైతులకు ఉరి తాళ్ళు పంపిణీ చేసే దురాలోచనతో ఉన్నారా అని అన్నారు.



# కొత్తూరులో ఎయిడ్స్ అవగాహన ప్రచార రథం



**కొత్తూరు, సెప్టెంబరు 26(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి మరియు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో సమగ్ర ఆరోగ్య ప్రచార రథం శుక్రవారం కొత్తూరు సామాజిక ఆసుపత్రిని సందర్శించింది. ఈ సందర్భంగా ప్రజల్లో ఎయిడ్స్ వ్యాధి నివారణ, చికిత్సా మార్గాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలపై అవగాహన కల్పించబడింది. ప్రచార రథంలోని స్క్రీన్ ద్వారా వ్యాధి వ్యాప్తి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఐసీటీసీ కేంద్రాలలో లభించే ఉచిత పరీక్షలు, సోకినవారు వినియోగించుకోవాల్సిన మందులు వంటి అంశాలు ప్రజలకు సూచించారు. అలాగే వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను కూడా వివరించారు. ఈ సందర్భంగా స్థానిక సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లీలాకుమార్ మాట్లాడుతూ సమాజంలో ఎయిడ్స్ పై అపోహలను తొలగించి, పరీక్షలు, చికిత్సా సదుపాయాలను సమయానికి వినియోగించుకోవాలని ప్రజలు ఈ అవగాహన కార్యక్రమం నేపథ్యంలో అనేక మంది ప్రజలు ఆసక్తిగా సమాచారం తెలుసుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాకేష్, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ దేవీప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది, ఐసీటీసీ కౌన్సిలర్ చ. భాస్కరరావు, ల్యాబ్ టెక్నీషియన్ ఎస్. జనార్దనరావు, లింక్ వర్కర్లు శ్రీను, భారతి, బాలరాజు పాల్గొన్నారు. అదేవిధంగా స్వచ్ఛంద సంస్థల ఒఆర్వీలు లక్ష్మి, కృష్ణవేణి (గెస్ట్ సంస్థ) మరియు భాను (వైసీబీ సంస్థ) పాల్గొన్నారు.

### వంశధార టెన్ ఆర్ కాలువ పూడికతీతల్లో ..

# అవకతవకలపై విచారించాలి

**జలుమూరు, సెప్టెంబరు 26 (వార్త):** ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగం లో వంశధార టెన్ ఆర్ కాలువ జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల కింద నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో 20 లక్షల రూపాయల నిధులతో తీసిన పూడికతీతలు అధ్వానంగా ఉండటంతో పాటు ప్రభుత్వ నిబంధనల మేరకు పూడిక అడుగులు తీయకుండా ఒక్క అడుగుతో సరిపెట్టి బిల్లులు పెట్టేందుకు ప్రయత్నించారని పిజిఆర్ఎస్లో ఫిర్యాదు తో పాటు, నీటిపారుదల శాఖ వంశధార డిప్యూటీ ఎస్.ఈ కి ఫిర్యాదు చేయడం జరిగింది అని రాజశేఖర్ తెలిపారు. ఎస్.ఈ స్పందించి త్వరలో శ్రీముఖిలింగం టెన్ ఆర్ కాలువ పనులు లో జరిగిన అవినీతిపై స్వయంగా అక్కడ కాలువ పూడికతీత జరిగిన పనులు పర్యవేక్షించి చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది అని సామాజిక కార్యకర్త, శ్రీముఖలింగేశ్వరాలయం ప్రధాన అర్చకులు నాయుడుగారి రాజశేఖర్ తెలిపారు .



## జగన్‌పై ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యాఖ్యలు సబబు కాదు

**పలాస, సెప్టెంబరు 26(వార్త):** సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అసెంబ్లీలో మాట్లాడిన తీరుపై వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శుక్రవారం పలాసలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో వైయస్సార్సీపి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని ఉద్దేశించి శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ 'సైకో' అని మాట్లాడడం సబబుగా లేదన్నారు. అసెంబ్లీ అన్నది ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యుత్తమ వేదిక అని, అక్కడ ఎలా ప్రవర్తించాలో ప్రవర్తించకుండా సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ నోటికి వచ్చినట్లు ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తే వైఎస్ఆర్సిపి శ్రేణులు చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.




# పాత పింఛను సాధించేవరకు పోరాటం




**కోటబొమ్మాళి, సెప్టెంబరు 26(వార్త):** సీపీఎస్ ఉద్యోగులకు పాత పింఛను సాధించేవరకు పోరాటం అగదని ఏపీసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావుఅన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో జిల్లా అసోషియేషన్ అద్యక్షుడు చల్ల సింహాచలం అద్యక్షతన జరిగిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పింఛను కొనసాగించేవరకు ప్రభుత్వాలు మారుతాయని ఆయన హెచ్చరించారు.

నాలుగు లక్షలు మ ంది సీపీఎస్ ఉద్యోగులు రావాల్సిన డీఏ బకాయిలు 20వేలు కోట్లు ఉండగా చివరిగా హైకోర్టులో కేసు కూడా నమోదు చేశామన్నారు. త్వరలోనే అవి పరిష్కారమవుతాయని సీపీఎస్ ఉద్యోగుల చైతన్య యాత్ర ఉత్తరాంధ్ర జిల్లాల్లో చేపట్టడానికి సిద్ధమవుతున్నామని ఆయన తెలిపారు. వ్యవస్థాప సభ్యులు బి. బాలక్రిష్ణ మాట్లాడుతూ 2003 వారికి న్యాయంగా అమలు చేయాల్సిన 57ను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో బొంతల ఆదినారాయణ, రమేష్, వైకుం ఠరావు, ప్రశాంత్, షణ్ముఖరావు తదితరులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, ఒకరికి గాయాలు



**కోటబొమ్మాళి, సెప్టెంబరు 26(వార్త):** మండలం కొతపల్లి గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన వాన వైకుంఠరావు (55) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం మృతుడు వైకుంఠరావు గురువారం సాయంత్రం మండలం సరియాపల్లి గ్రామ సమీపంలో ఉన్న పొలం పనులు ముగించు కొని తన భార్య రత్నాలుతో కలిసి నడుచుకుంటూ ఇంటికి వెలుతున్న సమయంలో అదే గ్రామానికి చెందిన కప్పల రమణ తన ద్విచ క్రవాహనం పై వెనుక నుంచి అతివేగంగా ఢీ కొనడంతో వైకుంఠరావు అక్కడకక్కడే మృతి చెందగా, రమణకు గాయాలయ్యాయి. రమణకు టెక్కలి ప్రభుత్వ అసుపత్రికి చికిత్స కోసం తరలించి, వైకుంఠరావు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ అసుపత్రికి పోస్టు మార్టంకు తరలించామని తెలిపారు. మృతుడు భార్య రత్నాలు ఇచ్చిన పిర్యాదు వే రకు శుక్రవారం కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వి. సత్యన్నారాయణ తెలిపారు. మృతుడుకు భార్యతోపాటు కుమారుడు శశిభూషణరావు ఉన్నారు.

# శ్రీకుమార్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే



**మందస, సెప్టెంబరు 26(వార్త):** హరిపురంలో గల శ్రీకుమార్ జూనియర్, డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దున్న తాతారావు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ దుమ్ము లక్ష్మణరావు మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే విద్యార్థులు కష్టపడి చదివి క్రమశిక్షణతో ముందుకు నడవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటలు, పాటలతో అలరించారు. ఇదే కళాశాలలో చదివి ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ ఫలితాలలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ సాధించిన పొందూరు సుధాకర్ కు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రవికుమార్, అధ్యాపక సిబ్బంది లోకేశ్వరరావు, సంతోష్, ప్రశాంత్, హేమలత రాజేశ్వరి, దామోదర, మేఘనాథ్, నీలకంఠం పాల్గొన్నారు.



## కొత్తమ్మతల్లి జాతర ఆదాయం రూ.22 లక్షలు

**కోటబొమ్మాళి, సెప్టెంబరు26 (వార్త):** కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాల ద్వారా మంగళ, బుధ, గురువారాల్లో రూ.22.08.481 ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాక్రిష్ణ తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హుండీలను దేవాదాయ శాఖాధికారులు సమక్షంలో లెక్కించారు. స్పెషల్ దర్శనం టిక్కెట్లు ద్వారా రూ.4.25 లక్షలు, మొక్కుబడి రుసుము ద్వారా రూ.2,38,600, హుండీల ద్వారా రూ.15.44.881 ఆదాయం లభించిందన్నారు. గత యేడాదితో పోల్చితే ఈ యేడాది రూ. 3.86.964లు ఆదాయం పెరిగిందన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో శ్రీకాకుళం ఏసీ బి.ఆర్.వి.వి. ప్రసాద్ పట్నాయక్, గ్రామ పెద్దలు బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌పి బాలు వర్ధంతి సభలో ధనంజయ




**ఇచ్ఛాపురం, సెప్టెంబరు26(వార్త):** టి.బరంపురం గ్రామానికి చెందిన ప్రముఖ జానపద సంగీత కళాకారులు, ఆల్ ఇండియా కళా రంగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆంధ్రప్రదేశ్, మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి తిప్పన ధనంజయ రెడ్డి విజయవాడ 2 గాంధీనగర్ హనుమంతరాయ నిర్వహించిన ఎస్పీ బాలసుబ్రమణ్యం 5వ వర్ధంతి సందర్భంగా ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. బాలు పాటలను వైయలిన్ పై ఆలపించారు. కార్యక్రమం లో పాల్గొన్న ధనుంజయ రెడ్డి కళారంగం వ్యవస్థాపక కార్యవర్గం ఆయన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఆల్ ఇండియా కళారంగం అధ్యక్షులు మాడుగుల సుధీర్ తో పాటు పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన గాయని గాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా కొనసాగుతున్న నవరాత్రి పూజలు



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 26(వార్త):** దేవీ శరన్నవరాత్రి పూజల్లో భాగంగా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్వేచ్ఛ వతి అమ్మవారి ఆలయంలో స్కంద మాత అలంకరణ లో భక్తులకు దర్శనమిచ్చారు. తులసీ గాం లో ఐదవ రోజు మాహా లక్ష్మీ అవతారం లో వైదేహిమాత అమ్మవారు దర్శనమిచ్చారు. 2016 మందారాలతో లక్ష్మిజగన్నాథ స్వామి కి పుష్పఅర్చన నిర్వహించారు.

## తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 26(వార్త):** రానున్న రెండు రోజులు భారీ వర్షాలు హెచ్చరిక నేపథ్యంలో తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ వెంకట రావు చెప్పారు. 9114115363 నెంబర్ ను సంప్రదించాలని కోరారు. శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకు 8.4 ఎం.ఎం.ల వర్షపాతం నమోదు అయినట్లు చెప్పారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546